

అపూర్వ పుస్తక సేకరణ
స్ఫూర్తి : డా॥ వెలగా వెంకటప్పయ్య
అలమూరి విక్రమ్, సజ్జావారిపాలెం,
తేపల్లె. Cell : 9392055065

# భైరవ భేరి

**సరసి**

''భౌ భౌ'' అరుపులతో ఆ ప్రాంతం అంతా కోలాహలంగా ఉంది. శునక మహా సభ ప్రారంభమైంది.

ఒక బక్క కుక్క ఖండువా సవరించుకుంటూ, చెవులు టపటపా కొట్టుకుంటూ మైకు ముందుకొచ్చింది. ''అందరికీ స్వాగతం. ఇప్పుడు ఈస్ట్ జోన్ ప్రతినిధి శ్రీ భైరవయ్య గారు, వెస్ట్ జోన్ ప్రతినిధి శ్రీ కుక్కన్న గారు, సెంట్రల్ జోన్ ప్రతినిధి, ఈనాటి సభకు అధ్యక్షుడు శ్రీమతి జాగిలాంబ గార్లను వేదిక మీదకు రావలసిందిగా ప్రార్థిస్తున్నాను'' అనగానే సభ కరతాళధ్వనులతో మోతెక్కిపోయింది.

"ముందుగా చిరంజీవులు పప్పీ, టామీలచే ప్రార్థన." అధ్యక్షులు ప్రకటించగానే, రెండు చిన్న చిన్న కుక్క పిల్లలు స్కర్టులేసుకుని మైకు ముందుకొచ్చి పాటందుకున్నాయి. "కుక్క వీర లేవరా, కినుక మాని కదలరా! శునక జాతి మేలు కోరి కక్ష కట్టి కరవరా! గ్రామ సింహాలై గర్జించాలి" అంటూ ఆవేశంగా పాడే సరికి మహాసభ ఉత్తేజంతో ఊగిపోయింది.

"తదుపరి, శతాధిక మానవులను కరిచి, రికార్డు సృష్టించి, ప్రస్తుతం విశ్రాంతి తీకుంటున్న, వెటరన్ శ్రీ శునకారావు గారిని వేదిక మీదకు రావలసిందిగా కోరుతున్నాం" అని అనౌన్సు చేశారు. కనకపు సింహాసనం తీసుకొచ్చి, అందులో శునకారావుగారిని కూర్చోబెట్టారు. వారికి ఘన సన్మానం చేసి, దుశ్శాలువా కప్పి, 'సువర్ణ దంతాల సెట్టు' అధ్యక్షుల చేతి మీదుగా బహూకరించేరు. సన్మాన పత్రంలో వారి ప్రతిభను వేనోళ్ళ కొనియాడుతూ, చిన్నప్పటి నుంచీ అవసరం ఉన్నా లేకపోయినా దొరికిన వారిని దొరికినట్టు కరిచి, మానవులకు గ్రామ సింహస్వప్నంగా మిగిలిపోయారని, ఛీఛీ లకు కుంగిపోకుండా, కర్ర దెబ్బలకు పారిపోకుండా కర్తవ్య నిర్వహణ కావించే వారనీ శునకారావు గారిని కీర్తించారు. అనంతరం వారికి, "శతాధిక మానవ క్షత గాత్ర కారక" బిరుదు ప్రదానం చేశారు.

తర్వాత అధ్యక్షులు గొంతు సవరించుకుని ప్రసంగించేరు. "మిత్రులారా. సమయం తక్కువ ఉన్నందున అందరి పక్షానా నేనే అధిక ప్రసంగం చేస్తాను. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన కార్యకర్తలు, ప్రతినిధులు, సభ్యులూ అందరికీ స్వాగతం. ఈనాడు ఇలా అత్యవసరంగా ఎందుకు మనం కలుస్తున్నామో మీకు తెలియంది కాదు. మనకు పెద్ద ఉపద్రవం ముంచుకు రాబోతోంది. మన జాతిని అంతం చేయడానికి మానవ జాతి కంకణం కట్టుకుని, ఆ దిశగా ప్రయత్నాలు ప్రారంభించింది. అసలు ఈ దౌష్ట్యానికి కారణం ఏమిటి?"

"కుక్క మనిషిని కరిస్తే అది వార్త కాదు, మనిషి కుక్కని కరిస్తేనే అది వార్త అని చెబుతూవుంటారు. అలాంటపుడు మన శునక మిత్రులు కొందరు ఎవరో కొందరిని కరిచేరని పెద్ద పెద్ద అక్షరాలతో వార్తాపత్రికల్లో రాయడం ఎంతవరకూ సమంజసం? వార్త కాని విషయాన్ని వార్తలా ఎందుకు రాస్తున్నారు? ఏం కొంపలంటుకుపోయాయి కుక్క కరిస్తే? కరవడం కుక్క లక్షణం. అసలు కుక్క అనేది కరవకుండా ఎట్లా ఉంటుంది? సూర్యుడు ఎండ కాయడం, ఆవు పాలనివ్వడం ఎంత సహజమో కుక్క కరవడమూ అంత సహజమన్న చిన్న విషయాన్ని ఈ మానవులు గ్రహించకపోతే ఎట్లా? కుక్క కరుస్తుందనే కదా, దానిని మానవుడు చేరదీసి, తనకు, తన ఆస్తులకు రక్షణగా నియమించుకుంటున్నాడు! గుప్పెడన్నం మెతుకులు తిని రాత్రింబగళ్ళు కాపలా కాసి కోట్లాది రూపాయల ఆస్తులను కాపాడుతున్న మన కుక్కల పట్ల విశ్వాసం లేకపోగా, పైగా వాటిని అంతం చేస్తారా? కేవలం కరవడాన్నే నేరంగా భూతద్దంలో చూపించారు తప్ప, మన కన్న విశ్వాసమైన జంతువు మరొకటి లేదని ఏ పత్రికైనా రాసిందా? మనం వారి పట్ల విశ్వాసం చూపిస్తే, వాళ్ళు మన పట్ల అవిశ్వాసం చూపిస్తున్నారు. ఇదే మన కుక్కత్వానికి, వాళ్ళ మానవత్వానికి ఉన్న తేడా" అంటూ జాగిలాంబ గారు ఆవేశంగా ఉపన్యసిస్తూ మధ్యలో కాసిని మంచి నీళ్లు తాగేరు.

"మానవ జాతి నశించాలి. శునక జాతీ జిందా బాద్" అంటూ ఒక కుక్క ఆవేశంతో అరిచి, దగ్గొచ్చి కూర్చుంది.

"దీన్ని నెపంగా చూపెట్టి, మన జాతి కందరకూ కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయించే దుర్మార్గమైన చర్యలకు పాల్పడుతున్నారు. అంటే, కొద్ది రోజులకు మన జాతి 'మటాష్' అయిపోయిట్టే. మన జాతి సర్వస్వం నాశనం అయిపోతే తర్వాత వాళ్ళ పరిస్థితి ఏమిటి? మానవుల్ని, వాళ్ళ సిరిసంపదల్నీ కాపాడే వారెవరు? పేదలూ పెద్దలూ అందరూ ఒకరినొకరు దోచుకుంటారు. అది గమనించుకోరేం?"

వెంటనే ఓ కుక్క లేచి "మనుష్యులైతే భార్యాభర్తల్లో ఒక్కరే కు.ని. ఆపరేషను చేయించుకుంటారు. కాని మనకైతే ఆడా మగా ఇద్దరకూ చేస్తున్నారు. ఏమిటీ అన్యాయం?" అంటూ గట్టిగా ప్రశ్నించింది.

"అంటే మనకి బహు భార్యత్వం ఉందనా?" అని ఒక శునకం అనగానే, "కూర్చోరా, మనకున్నది బహు భార్యత్వం కాదు, భహు భర్తృత్వం" అంది మరో శునకం.

"మా ఏరియాలో చిన్న పిల్లలని కూడా చూడకుండా పట్టుకుపోయి ఆపరేషన్ చేసేస్తున్నారండీ" వాపోయింది మరో జాగిలం.

"ఛీ మరీ కుక్క బతుకైపోయింది మనది".

"నన్ను చెప్పనీ. ఇటువంటి క్లిష్టమైన సమయంలో మనమందరం ఏకం కావాలి. జాతి వర్గ వర్ణ విచక్షణ అనేది లేకుండా మనం సంఘటితం కావాలి".

"మనం సరేనండీ, వీధుల్లో తిరిగేవాళ్ళం. పెద్ద పెద్ద ఇళ్ళల్లో ఉండే మన సోదరుల సంగతేమిటి? వాళ్ళు మనల్ని చూస్తేనే అసహ్యించుకుంటున్నారు".

"పైకి అలా కనిపిస్తున్నారు గానీ, వాళ్లు మాత్రం సుఖపడుతున్నారనుకుంటున్నావా? ఇంత అన్నం, మాంసం పెట్టినంత మాత్రాన సరిపోయిందా? తోడు లేకుండా వొంటరి జీవితం గడుపుతున్నారు వాళ్ళు. వాళ్ళదీ ఓ బతుకే?"

"ఏ మాటకామాటే చెప్పుకోవాలోయ్. ఆ విషయంలో మాత్రం మనం చాలా అదృష్టవంతులం" అందొక వీధి కుక్క.

"వాళ్ళు మనతో కలవకపోతే వాళ్లే నష్టపోతారు. వాళ్ళ సంగతి వాళ్లనే తేల్చుకోనివ్వండి. మనం మాత్రం కలిసి పోరాడుదాం. మానవులెక్కడ కనిపించినా సరే కరిచి కసి తీర్చుకుందాం. ఇంత కాలం మన సమనాన్నే చూశారు, ఇక మన సమరాన్ని చూస్తారు" అంటూ జాగిలాంబ గారు ఆవేశంగా మొరిగి ముగించారు.

ఒక వృద్ధ శునకం లేచింది "దయచేసి అందరూ నిశ్శబ్దంగా ఉండండి. ఆవేశం కాదు కావలసింది ఆలోచన. అందరూ అంగీకరిస్తారంటే నేనొక సూచన చేస్తాను. మనందరం కలిసి మానవుల్ని కరిచి పగతీర్చుకుందామనంటున్నారు. అలా కరిచేమనే కదా ఇప్పుడీ స్థితి వచ్చింది. అది కాదు పరిష్కారం. మనకందరకూ కు.ని. ఆపరేషన్లు చేయడం ఖాయం. మన జాతి అంతరించిపోవడం ఖాయం. ఈ లోగా మనం సాధ్యమైనంత నష్టం మానవులకి కలిగించాలి. మామూలుగా ఇలా వెళ్ళి కరిస్తే వైద్య చేయించుకుంటారు. అలా కాకుండా మనం పిచ్చి కుక్కలంగా మారి అప్పుడు కరవాలి. అప్పుడు వాళ్ళకి చావు ఖాయం అవుతుంది. అంచేత, మనజాతి యావత్తూ పిచ్చెత్తిపోవాలి. అదే మన తక్షణ కర్తవ్యం. ఎలాగంటే, మనలో కొందరు చిత్తచాంచల్యం కలిగిన పిచ్చి సోదరులున్నారు. వాళ్ళ చేత ముందు మనం కరిపించుకోవాలి. అప్పుడు మనకి కూడా పిచ్చెక్కుతుంది. మనం మన జిల్లాలకు, గ్రామాలకు పోయి, మన తోటి సోదరులందరినీ కరవాలి. మన శునక జాతినంతా ఒకళ్లనొకళ్ళు కరుచుకుని పిచ్చ కుక్కలం అయిపోవాలి. అప్పుడు గాని మానవుల పనిపట్టడానికి లేదు. అందు కోసం ముందు మనం త్యాగధనులం కావాలి".



> కరవడం కుక్క లక్షణం. అసలు కుక్క అనేది కరవకుండా ఎట్లా ఉంటుంది? సూర్యుడు ఎండ కాయడం, ఆవు పాల నివ్వడం ఎంత సహజమో కుక్క కరవడమూ అంత సహజమన్న చిన్న విషయాన్ని ఈ మానవులు గ్రహించకపోతే ఎట్లా? కుక్క కరుస్తుందనే కదా, దానిని మానవుడు చేరదీసి, తనకు, తన ఆస్తులకు రక్షణగా నియమించుకుంటున్నాడు!

అనగానే మహాసభ మొరుగు రాగాలాపనలతో దద్దరిల్లిపోయింది. అప్పటి వరకూ చొంగలు కారుస్తూ నిరుత్సాహంగా ఆ మూలా ఈ మూలా కూర్చున్న కొద్దిపాటి 'పిచ్చి శునకాలు' రెచ్చిపోయి తోటి శునకాల్ని కరవడం ప్రారంభించాయి. తర్వాత ఆ కరవబడిన కుక్కలు మిగిలిన కుక్కల్ని పిచ్చి పిచ్చిగా కరవసాగేయి. త్యాగానికి వెన్ను వెరవని కుక్కలు ముందుకొచ్చి కరిపించుకుంటూ, బాధతో మూలుగుతూ పక్కవాళ్ళని కరుస్తున్నాయి. మొత్తం సభా వేదికంతా కలకలంతో దుమ్ములేచిపోయింది భౌభౌ శబ్దాలు, బాధల అరుపులు అంబరాన్నంటాయి.

ఈ హడావుడిలో తన విద్యుక్తధర్మంగా ఓ కుక్క పక్క కుక్కని కండ వూడొచ్చేలా కరిచి, మరుక్షణం ఏం జరిగిందో ఏమో ఒక్క గావుకేక పెట్టి, ఎగిరి కిందపడింది.

***

"చచ్చేన్నాయనోయ్" అంటూ ఉలిక్కిపడి మంచం మీద లేచి కూర్చున్నాడు విశ్వాస రావు. "ఏవిటిదీ? ఏవిటీ కొరకడం?" అంటూ తన జబ్బ మీద పళ్ళ గాట్లు చూపించింది అతడి భార్య. "ఇందాకట్నించి, భౌభౌమనీ, కుయ్యోమని పలవరిస్తూ వుంటే ఏవిటో అనుకున్నా! పిచ్చి గాని పట్టిందా? చూడండెలా కరిచారో?" అంటూ ఫెడీల్మని ఇంకోటి తగిలించింది.

"ఇదంతా కలా? బతికించేవే! పిచ్చి కుక్క నైపోయానేమోననుకుని. భయపడిపోయానే! నువ్వు కొట్టినా, తన్నినా నీ పక్కనే పడుంటానే" అంటూ ఏడుస్తూ, ఆమె చేతిని నాలికతో నాకడం ప్రారంభించాడు విశ్వాసరావు.

★